క్లుప్తంగా

ముప్పవరంలో ఉచిత గుండె వైద్య శిబిరం

జే.పంగులూరు: మండలంలోని ముప్పవరం గ్రామంలో నేడు ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు విజయవాడ హెల్ప్ హాస్పిటల్ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో పంచాయతీ ఆఫీసు సొసైటీ బిల్డింగ్ వద్ద శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో ఆయాసం, గుండె నొప్పి, గుండె బరువుగా ఉండటం, తల తిరగటం, ఎడమ చేయి లాగటం, ఎక్కువ కాలం బీపీ, షుగరు ఉన్నవారికి, ఎంతో ఖరీదైన గుండె స్కానింగ్ పరీక్షలు, ఈసీజీ, ఈసీహెచ్ (ఎకో) స్కానింగ్, రక్తపరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. అవసరం కొద్ది ఉచిత యాంజియో గ్రామ్ పరీక్ష చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని విజయవాడ హెల్ప్ హాస్పిటల్ నిర్వాహకులు తెలిపారు.

నేడు కారంచేడులో స్పందన

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడులో సోమవారం ఉదయం 11 గంటలకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహశీల్దారు ఎస్ వెంకటరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన రైతులు, విద్యార్థులు, ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు వారికి అవసరమైన అర్జీలను పెట్టుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మధ్యాహ్నం 2గంటలకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండలంలో అన్ని గ్రామాలకు చెందిన వీఆర్ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

నేడు బల్లికురవలో కంటి శిబిరం

బల్లికురవ: అంధత్వంతో బాధపడుతున్న అవ్వాతాతలకు కంటి పరీక్షలు చేసేందుకు సోమవారం బల్లికురవ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గుంటుపల్లి పీహెచ్సీ వైద్యాధికారి రమీజ్ అహమ్మద్ ఆదివారం తెలిపారు. గుంటూరు పెదకాకాని శంకర్ వైద్యశాల కంటి వైద్యుడు ఎల్లారెడ్డి పరీక్షలతో అవసరమైన వారికి కళ్లజోళ్లు, 24న శంకర వైద్యశాలలో శస్త్ర చికిత్సలు చేయిస్తారన్నారు. బల్లికురవతో పాటు పరిసర గ్రామాల ప్రజలు శిబిరాన్ని సద్వియోగపరుచుకోవాలని వైద్యాధికారి కోరారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయణం, నిజ శ్రావణ మాసం, చిత్త నక్షత్రం, పంచమి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

1,500 ఎకరాల్లో ఈ క్రాప్ బుకింగ్

కొత్తపట్నం: మండలంలో 1,500 ఎకరాల్లో సాగుచేస్తున్న వ్యవసాయ పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేసినట్లు వ్యవసాయశాఖ ఏవో మోహన్‌రెడ్డి తెలిపారు. మిగిలిన 400 ఎకరాల నమోదును సెప్టెంబర్ నెలాఖరుకు పూర్తి చేస్తామన్నారు. వేరుశనగ, చామ, ఆకు కూరలు, కూరగాయలు, కొబ్బరితోటలు, మిర్చి పంటలకు ఈ క్రాప్ ప్రక్రియ జరుగుతోందన్నారు. రైతులందరూ ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ఈ క్రాప్ బుకింగ్ చేసుకోకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు నష్టపోతారని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో డీఏపీ, యూరియా, 10-26-26 రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతానికి రంగాయపాలెం, రాజుపాలెం, అల్లూరు, మోటుమాల, ఈతముక్కల, గవళ్లపాలెంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఆధార్ కార్డు తీసుకుని ఎరువులు తీసుకోవచ్చన్నారు.



వేటపాలెం: 6 వార్డులో మహాలక్ష్మయ్యకు సర్టిఫికెట్ అందిస్తున్న రిటర్నింగ్ అధికారులు

ఎన్నికలు ఏదైనా సరే.. ఎప్పుడైనా సరే వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు ఖాయం. పంచాయతీ కానీ, స్థానిక సంస్థల ఎన్నికలు కానీ.. వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులు గెలుపుబాట పడుతున్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన చూసి ప్రజలు మార్పు చెందారు. అందుకే ఓట్లన్నీ గుంపగుత్తగా వేసి వైఎస్సార్ సీపీని గెలిపిస్తున్నారు. దీంతో ప్రతిపక్షాల అబద్ధపు వాగ్దానాలను, కుట్రలను ప్రజలు తిప్పికొట్టారని అర్థమవుతోంది. అంతేకాకుండా రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారనడానికి ఈ ఉపఎన్నికలే నిదర్శనం. వేటపాలెం మండలంలో రెండు వార్డులకు గాను రెండు వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పర్చూరు నియోజకవర్గం మార్టూరు మండలం దేగరమూడిలో ఒక వార్డు, యద్దనపూడి మండలంలో రెండు వార్డుల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కారంచేడు మండలంలో స్వర్ణ వార్డులో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి 227 ఓట్లతో, ఇంకొల్లు మండలం పావులూరు సర్పంచ్ 499 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అద్దంకి నియోజకవర్గం సంతమాగులూరులో ఒకటి, కొరిశపాడులో ఒక వార్డుల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అద్దంకి మండలంలోని శంఖవరప్పాడు గ్రామంలో ఎనిమిదో వార్డులో 60 ఓట్ల మెజార్టీతో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి గెలుపొందారు.



వేటపాలెం: 10 వార్డు నుంచి గెలుపొందిన జీ నాగరాజకుమారికి సర్టిఫికెట్‌అందిస్తున్న అధికారులు

- అద్దంకిలో 3, చీరాలలో 2, పర్చూరులో 5 స్థానాలు కైవసం
- మూడు నియోజకవర్గాల్లో మొత్తం 13 స్థానాలకు ఉపఎన్నికలు
- 10 స్థానాల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారుల విజయం

ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారుల హవా



కర్లపూడి రజిత, దేగరమూడి



ఎం వీరారెడ్డి, మున్నంగివారిపాలెం



పీ ఆదెయ్య, పోలూరు



మట్టి యోహాను, స్వర్ణ



బీ రాఘవరెడ్డి, శంఖవరప్పాడు



టీ శ్రీనివాసులు, కొరిశపాడు



ఎలీశా, గురిజేపల్లి

రామన్నపేటలో వైఎస్సార్ సీపీ ఏకగ్రీవం

వేటపాలెం:

వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీలో రెండు వార్డులకు జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపర్చిన ఇద్దరు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 6వార్డులో పొట్లూరి మహాలక్ష్మయ్య, 10వ వార్డులో గౌరా బత్తిన నాగరాజ కుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అద్దంకి నియోజకవర్గంలో..

మేదరమెట్ల /అద్దంకి రూరల్: మండల కేంద్రమైన కొరిశపాడు పంచాయితీ పరిధిలోని ఏడో వార్డులో వైఎస్సార్ సీపీ బలపరిచిన తొలుసూరి శ్రీనివాసులు, సంతమాగులూరు మండలం గురిజేపల్లి రెండో వార్డు ఎలీశాలు ఏకగ్రీవం అయ్యారు. అద్దంకి మండలం శంఖవరప్పాడు 8 వార్డులో బైపిరెడ్డి రాఘవరెడ్డి 60 ఓట్ల మెజార్టీతో టీడీపీ అభ్యర్థిపై విజయం సాధించాడు.

పర్చూరు నియోజవర్గంలో..

- బద్దలైన టీడీపీ కంచుకోటలు

చినగంజాం/ మార్టూరు/ యద్దనపూడి/ కారంచేడు: పంచాయతీ ఉప ఎన్నికల్లో భాగంగా పర్చూరు నియోజకవర్గంలో నిర్వహించిన సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలలో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు విజయం సాధించారు. నియోజకవర్గ పరిధిలోని ఇంకొల్లు మండలం పావులూరు గ్రామ సర్పంచ్ పదవికి, రెండు వార్డులకు, మార్టూరు మండలం దేగరమూడి గ్రామ పంచాయతీ పరిధిలోని ఒక వార్డు, యద్దనపూడి మండలంలోని మున్నంగి వారిపాలెం, పోలూరు గ్రామ పంచాయతీలలోని ఒక్కొక్క వార్డుకు, పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం గ్రామ పంచాయతీ ఒక వార్డుకు, కారంచేడు మండలం స్వర్ణ గ్రామ పంచాయతీలలోని ఒక వార్డుకు ఎన్నికలు నిర్వహించారు. పావులూరు పంచాయతీకి శనివారం ఎన్నిక నిర్వహించగా వైఎస్సార్ సీపీ మద్దతుదారు బొల్లెద్దు లుధియమ్మకు 1285 ఓట్లు, టీడీపీ మద్దతుదారు కొత్తపల్లి మహేష్‌కు 789 ఓట్లు, జనసేన మద్దతు దారు ఎలీషాకు 111 ఓట్లు పోలయ్యాయి. సుమారు 499 అత్యధిక ఓట్ల మెజార్టీతో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు లుధియమ్మ విజయ కేతనం ఎగురవేశారు. అదే విధంగా మొత్తం 7 వార్డులకు ఎన్నికల నిర్వాహణ చేయగా వాటిలో వైఎస్సార్ సీపీ మద్దతు దారులకు 4 వార్డులు వైఎస్సార్ సీపీ, 3 టీడీపీ మద్దతు దారులు వార్డు సభ్యులుగా ఎంపికయ్యారు. వీటిలో స్వర్ణ గ్రామ పంచాయతీలో వార్డుకు ఎన్నిక జరుగగా మిగిలిన 6 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. యద్దనపూడి మండలంలో నిర్వహించిన వార్డు ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు మున్నంగి వారిపాలెం 3వ వార్డుకు మనుబోతు వీరారెడ్డి, పోలూరులో 6వ వార్డుకు ఆదియ్య నామినేషన్‌లు దాఖలు చేయగా వారికి పోటీగా నామినేషన్‌లు దాఖలు కాకపోవడంతో వారి ఎన్నిక ఏకగ్రీవం అయింది. మార్టూరు మండలంలోని దేగరమూడి పంచాయతీ 6 వ వార్డు ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారు కర్లపూడి రజితకు పోటీలేక పోవడంతో ఏకగ్రీవంగా విజయసాధించింది. కారంచేడు మండలం స్వర్ణ పంచాయతీ 13 వ వార్డుకు ఎన్నికలు జరుగగా వైఎస్సార్ సీపీ మద్దతు దారు మట్టి యోహాను తన సమీప అభ్యర్థి జనసేన మద్దతుదారు కట్టా రాజేష్‌పై 179 ఓట్లు తేడాతో విజయం సాధించారు.

పంచాయతీ ఉపఎన్నికల్లో గెలుపొందిన వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులు		
నియోజకవర్గం	ఏకగ్రీవ వార్డులు	ఎన్నికలు జరిగిన వార్డు/ సర్పంచ్
అద్దంకి	2	1
పర్చూరు	3	1 వార్డు / 1 సర్పంచ్
చీరాల	2	0

పావులూరు గ్రామ సర్పంచ్‌గా లుధియమ్మ..

ఇంకొల్లు మండలంలోని పావులూరు గ్రామ సర్పంచ్‌కు జరిగిన ఉప ఎన్నికలలో వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థి బొల్లెద్దు లుధియమ్మ 499 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. పావులూరు గ్రామ సర్పంచ్ బొల్లెద్దు పరిశుద్ధరావు మృతి చెందటంతో పావులూరుకు ఉప ఎన్నిక నిర్వహించారు. ఉప ఎన్నిక బరిలో పరిశుద్ధరావు భార్య లుధియమ్మను పోటీలో ఉంచగా శనివారం నిర్వహించిన ఎన్నికల్లో ఆమె గెలుపొందారు. పావులూరులో మొత్తం 3677 ఓట్లు ఉండగా శనివారం నాటి పోలింగ్‌లో 2282 ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్ సీపీ బలపరచిన లుధియమ్మకు 1288 ఓట్లు, టీడీపీ బలపరచిన అభ్యర్థి కొత్తపల్లి మహేష్ బాబుకు 789 ఓట్లు, జనసేన అభ్యర్థి వలేరు ఎలీషాకు 111 ఓట్లు పోలయ్యాయి. నోటాకు 42 ఓట్లు, చెల్లని ఓట్లు మరో 52 పోలయ్యాయి. దీంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

జగనన్న సంక్షేమపాలనకు సంపూర్ణ మద్దతు

- ఏపీ శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: పంచాయతీ ఉప ఎన్నికల్లో అత్యధిక స్థానాలో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులు అధిక మెజారిటీతో గెలుపొందటంతో సీఎం జగన్ మోహన్‌రెడ్డికి పాలనకు ప్రజలు సంపూర్ణ మద్దతు అందించారని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 3 వార్డు స్థానాల్లో 1 వార్డు కు ఎన్నికలు జరగ్గా, 2 వార్డులు ఏకగ్రీవాలతో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించారన్నారు. టీడీపీని ప్రజలు చిత్తుగా ఓడించారన్నారు. వైఎస్సార్ సీపీకి ప్రజా మద్దతు తిరుగులేదని నిరూపించారన్నారు.

వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ



నిత్యావసర సరుకులు, పండ్లు అందిస్తున్న రోటరీ సభ్యులు

ఇంకొల్లు (చినగంజాం): రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ ఆధ్వర్యంలో గంగవరంలోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆదివారం అవసరమైన నిత్యావసర సరుకులు, పండ్లు అందజేశారు. రోటరీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు సతీమణి లక్ష్మీకాంతం జ్ఞాపకార్థం వృద్ధులకు అందజేశారు. రోటరీ సభ్యులు రామ్మోహనరావు సేవలను అభినందించారు. కార్యక్రమంలో రోటరీ ఉపాధ్యక్షుడు అలవల శ్రీనివాసరెడ్డి, గోరంట్ల నాగేశ్వరరావు, వంకాయలపాటి శ్రీమన్నారాయణ, లక్ష్మీకాంతం కుమార్తె ఝాన్సీలక్ష్మి, అల్లుడు పోపూరి శేషగిరిరావు, ఆశ్రమము నిర్వాహకులు బొడ్డు వర ప్రసాద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



అంకమ్మకు సహాయాన్ని అందిస్తున్న ఐక్యవేదిక సభ్యులు

అద్దంకి రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబానికి దాతలు ఆర్థిక సాయం అందించారు. పట్టణంలోని ఆటోనగర్‌లో నివాసం ఉంటున్న కొండా నాగార్జున అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అలాగే ఇద్దరు కమారులు పుట్టుకతోనే అంగవైకల్యం బారిన పడ్డారు. దీంతో భార్య అంకమ్మ కూలి పనులు చేసుకుంటూ పోషించలేక ఇబ్బందులు పడుతోంది. ఆదివారం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిత్యావసర సరుకులు, రూ.16,800 నగదును అంకమ్మకు అందజేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి శ్రీమన్నారాయణ, వార్డు కౌన్సిలర్ గుంజి కోటేశ్వరరావు, చెన్నుపల్లి నాగేశ్వరరావు, అంకం నాగరాజు, కొమ్మాలపాటి బుజ్జి, జ్యోతి డేవిడ్, మంచు హనుమంతరావు, కుమారి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమ నూతన భవనం ప్రారంభం



అనాథాశ్రమానికి విరాళం అందిస్తున్న జేడీ హనుమంతరావు

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో నూతనంగా నిర్మాణం జరుపుకున్న అమ్మ అనాథ ఆశ్రమం భవనాన్ని ఆదివారం అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ పావులూరి హనుమంతరావులు పూజలు నిర్వహించి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా పావులూరి హనుమంతరావు ఆశ్రమ నిర్వాహణకు రూ 50 వేలు విరాళాన్ని ఆశ్రమ నిర్వాహకుడు గుంటుపల్లి చందు దంపతులకు అందజేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

సమాజసేవలో భాగస్వాములు కావాలి



యువకులకు అవగాహన కలిగిస్తున్న ఎస్సై సురేష్

చినగంజాం: సమాజంలో మంచి నడవడిక కలిగిన పౌరులుగా మెలుగుతూ సమాజ సేవలోపాలు పంచుకోవాలని ఎస్సై కే సురేష్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పలు గ్రామాలకు చెందిన నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులకు ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యువకులు సమాజ సేవకు ఉపయోగ పడాలని, సమాజాన్ని చెడగొట్టేందుకు ప్రయత్నించరాదన్నారు. అందరి మన్ననలు పొందే విధంగా ప్రవర్తన ఉండాలని, పోలీసుల దృష్టిలో మంచి ప్రవర్తన కలిగి, స్వయం ఉపాధి కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువకులు పాల్గొన్నారు.

భోజనశాల భవన నిర్మాణానికి భూమిపూజ



ప్రత్యేక అలంకరణతో కనక నాగవరపమ్మ



భూమి పూజ చేస్తున్న దాతలు

వేటపాలెం: మండల పరిధిలోని రామన్నపేట పంచాయతీ రావూరిపేట శివారులో వేంచేసియున్న కనక నాగవరపమ్మ దేవస్థానం ప్రాంగణలో రూ. 14 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మంచనున్న భోజనశాలకు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా దాతలు చుండూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ వేటపాలెం చుండూరు లొంప కాపు పెద్ద శెట్టిలు నిర్ణయం మేరకు భోజనశాల ఏర్పాటు చేస్తున్నమని చెప్పారు. మరో భక్తుడు చెరుకూరి జయశ్రీ కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి పనుల కోసం రూ. 30 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో భాను మూర్తి, బండ్ల బాబు, వెంకట్రావు, భవాని శంకర్, శ్రీనివాస్ రావు, మస్తాన్‌రావు, నాగరాజ్ తిదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ కొలుపులు



అమ్మవారి చిత్రపటం



అమ్మవారికి నైవేద్యాలను తీసుకొస్తున్న భక్తులు

కారంచేడు: ప్రతి ఏటా సాగుకు ముందు గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి కొలుపులు నిర్వహించడం గ్రామ ఆనవాయితీ. దీనిలో భాగంగా ఈ ఏడాది వ్యవసాయ పనులు ప్రారంభానికి ముందుగా గ్రామంలోని లైబ్రరీ బజారు, గోడమూల బజారుకు చెందిన కొలుపులను ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి నుంచే గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారుల కోలాటంతో గ్రామంలో పెద్ద ఎత్తున సంబరం నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి తలంటు స్నానాలు ఆచరించి, పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం గ్రామ దేవతను ప్రత్యేకంగా అలంకరించిన ప్రత్యేక వాహనంపై ఉంచి ఊరేగించారు. యువతీ, యువకులు వీరతాళ్లతో అమ్మవారి ప్రతిమకు ముందు నృత్యాలు చేశారు. గ్రామంలోని భక్తులు, రైతులు, పెద్దలు, మహిళలు, యువతీ, యువకులు కొలుపుల్లో పాల్గొన్నారు.

దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు అవసరం



ద్రోణాదులలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది



మోదేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు

అద్దంకి రూరల్: దోమకాటు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని మోదేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్ జయచంద్రరావు పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మండలంలోని ధర్మవరం గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దోమల కాటు వల్ల వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ దోమకాటుకు గురైతే మలేరియా వ్యాధి సోకుతుందని ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ దోమకాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలన్నారు. జ్వరం సోకితే ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాని వైద్యాధికారులు వివరించారు. ర్యాలీలో హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, ఎంపీహెచ్ఈవో ఏ.నాగేశ్వరరావు, ఏఎస్ఎం రాజేశ్వరీ, తదితరులు పాల్గొన్నారు.

ద్రోణాదులలో..

మార్టూరు: వర్షాకాలంలో దోమల వ్యాప్తి వలన ప్రజలకు మలేరియా, డెంగీ, చికున్ గున్యా, బోధకాలు తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని దోమల నివారణలో వ్యాధులకు దూరం కావచ్చని ద్రోణాదుల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు దివ్యలహరి, రేష్మాసుల్తానా తెలిపారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో వారు ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల నివారణకు పరిసరాలలో పాత టైర్లు, పాత సామాన్లు, తొట్టెల్లో నీటి నిలువలు, ఉండకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అనారోగ్య లక్షణాలు కల్పిస్తే స్థానిక ఆశ వర్కర్‌లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని వారు తెలిపారు. వ్యక్తిగత పరిశుత్రపై కూడా శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఏఎన్ఎంలు, ఆశ వర్కర్‌లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కొలుపుల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ సునీత



పొంగళ్లు చెల్లిస్తున్న ఎమ్మెల్సీ పోతుల సునీత

చీరాల: చీరాల రూరల్ మండలం కావూరివారిపాలెం పంచాయతీలోని తులసీనగర్‌లో ఆదివారం పోలేరమ్మ అమ్మవారి కొలుపులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోతుల సునీత పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అమ్మవారికి పొంగళ్లు, మొక్కుబడులను చెల్లించారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

కొలుపులు, ప్రతిష్ఠకు ముస్తాబు..

బల్లికురవ: మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో గోరంట్ల వారిదేవర ఈర్లగంగమ్మ తల్లి కొలుపులకు సోమవారం అంకురార్పణ చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. సుమారు రూ.20 లక్షలతో గ్రామ కూడలిలో ఆలయాల్లో భాగంగా దేవర ఈర్ల గంగమ్మను బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు ప్రతిష్ఠించనున్నారు. సోమవారం గోరంట్ల కుటుంబ సభ్యులంతా చీరాల సముద్ర స్నానానికి శిలలతో వెళ్లి మంగళవారం కొలుపుల్లో భాగంగా గ్రామోత్సవం, బుధవారం ప్రతిష్ఠ రాత్రికి అన్నదానం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ పనులకు రాష్ట్రంతోపాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న గోరంట్ల వంశస్థులంతా రావటంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.